ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



చిత్తూరు
జిల్లా వార్తలు

బుధవారం 28 మే 2025



కాణిపాక ఆలయ మాడవీధుల్లో యోగా చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఈవో పెంచలకిషోర్ తదితరులు

యోగాకు సమయం కేటాయించుకోండి

ఐరాల(కాణిపాకం), మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రశాంతత పొందాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాణిపాకం ఆలయ మాడవీధుల్లో మంగళవారం ఈవో పెంచలకిషోర్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తోపాటు ఆలయ ఈవో, అధికారులు, సిబ్బంది, ఐరాల మండలంలోని పాఠశాలల విద్యార్థులు, తవణంపల్లె మండలంలోని దిగువమాఘం అమరరాజ పాఠశాల విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఈవో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమయాన్ని కేటాయించుకుని యోగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం యోగాపై అవగాహన కల్పించే బ్రోచర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. పర్యాటక ఆర్డీ రమణ ప్రసాద్, డీపీఎం శ్రీనివాసరావు, జిల్లా అధికారి గౌరి, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్‌వో సుధారాణి, దేవదాయ సహాయ కమిషనర్ చిట్టెమ్మ, డీఎస్పీ బాలాజీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ బాషా, తహసీల్దార్లు మహేష్‌కుమార్, సుధాకర్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, యోగా గురువు శ్రీనివాసులు, ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలగా మారిన బాలుర బడి

రామకుప్పం, మే 27(ఆంధ్రజ్యోతి):రామకుప్పం మండలం విజలాపురంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలగా మార్చినట్టు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బాలికలను మాత్రమే చేర్చుకుంటామన్నారు.బాలుర పాఠశాలను బాలికల పాఠశాలగా మార్పు చేసిన విషయంపై గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు గిరిజన ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అడ్మిషన్లకు సంబంధించి పూర్తి వివరాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర బాబును 9502806425, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి మూర్తిని 9441140202, 9490957021 నెంబర్ల ద్వారా పనిదినాల్లో సంప్రదించాలని సూచించారు.

4లోపు ఆధార్‌తో బ్యాంకు ఖాతాను అనుసంధానం చేసుకోండి

చిత్తూరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌తో బ్యాంకు ఖాతాను జూన్ 4వ తేదీలోపు అనుసంధానం చేసుకోవాలని తపాలా శాఖ చిత్తూరు డివిజన్ సూపరింటెండెంట్ లక్ష్మణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేయడానికి ఇది అవసరమన్నారు. తపాలా శాఖ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఆధార్ సీడింగ్‌తోపాటు ఎన్‌పీసీఐ లింకేజీ, ఖాతాలు లేనివారికి నూతన పోస్టల్ బ్యాంకింగ్ ఖాతాను తెరవనున్నట్లు తెలిపారు. దీనికోసం అన్ని పోస్టల్ కార్యాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పచ్చదనం మరింత పెంచేలా....

రూ.14.5 లక్షలతో 10 లక్షల మొక్కల పెంపకం



తవణంపల్లె మండలం లింగాల బావి నర్సరీలో పెంచుతున్న మొక్కలు

చిత్తూరు సెంట్రల్, మే 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక అటవీ విభాగంలోని ఆరు నర్సరీల్లో 10 లక్షల మొక్కలు పెంచుతున్నారు. రూ.14.5 లక్షల ఉపాధి హామీ నిధులతో ఈ మొక్కల పెంపకం జోరుగా సాగుతోంది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. వేప, అల్లనేరేడు, గోరింట, టికోమా, జామ, దానిమ్మ, టేకు, ఎర్రచందనం, తులసి, రావి, మర్రి, వెలగ, సరుగుడు వంటి రకాల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. తవణంపల్లె మండలం లింగాలబావి నర్సరీలో రూ.30.5 లక్షలు, ఐరాల సెంట్రల్ నర్సరీలో రూ.2 లక్షలు, గంగవరం మండలం గజరాం నర్సరీలో రూ.4 లక్షలు, పెద్దపంజాణి మండలం బట్టందొడ్డి నర్సరీలో రూ.2 లక్షలు, రామకుప్పం ననియాల నర్సరీ, బంగారుపాళ్యం నర్సరీలో ఒక్కో లక్ష రూపాయల వ్యయంతో మొక్కలను పెంచుతున్నారు.

జూలై, ఆగస్టు నెలల్లో మొక్కల పంపిణీ



వర్షాలు తరచూ కురుస్తున్న క్రమంలో నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. రూ.14.5 లక్షల ఉపాధి నిధులతో 10 లక్షల మొక్కలు పెంచుతున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు జూలై, ఆగస్టు నెలల్లో మొక్కలను పంపిణీ చేయనున్నాం. ఎంపీడీవో కార్యాలయాలు, పొలంగట్లపై, రోడ్డుపక్కన, పంచాయతీల్లోని పల్లెవనాలు, స్కూల్స్ ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు పెంచడానికి అవసరమైనన్ని ఇవ్వనున్నాం. రైతులకు సైతం మొక్కలు ఉచితంగా ఇస్తాం.

- జ్ఞానప్రకాశరావు, సామాజిక అటవీ విభాగం డీఎఫ్‌వో

మామిడి కోతలు ఆగాయ్

- రేట్ల పతనంతో యార్డులకూ తగ్గిన కాయలు
- ధర పలుకుతున్న 'బేనీషా' మాత్రం ఎగుమతి

చిత్తూరు సెంట్రల్/ బంగారుపాళ్యం, మే 27 (ఆంధ్రజ్యోతి): మామిడి ధరలు ఒక్కసారిగా పతనం కావడంతో రైతులు కోతలు నిలిపేశారు. దీంతో చిత్తూరు, బంగారుపాళ్యం మార్కెట్ యార్డులకు కాయలు రావడం తగ్గిపోయాయి. మూడ్రోజుల ముందు బంగారుపాళ్యం మార్కెట్‌కు వంద టన్నుల కాయలు వస్తుంటే మంగళవారానికి 40టన్నులకు పడిపోయింది. చిత్తూరు మార్కెట్ యార్డుకు రోజుకు 50 టన్నులు వస్తుండగా, నాలుగు టన్నులకు పడిపోయింది. పుల్లార ధర టన్ను రూ.2వేలకు పడిపోయి చివరికి రూ.5వేలకు చేరింది. రాలిపోయిన, సాధారణ రకం బేనీషా టన్ను రూ.15వేలు పలుకుతోంది. ఇందులోనే మొదటి క్వాలిటీ బేనీషా (కలర్) రూ.23వేలు ఉండగా, ఇవి మాత్రం బంగారుపాళ్యం నుంచి ఢిల్లీకి ఎగుమతి అవుతున్నాయి. తోతాపురి (కలర్) టన్ను రూ.12 వేల నుంచి రూ.18 వేలు పలుకుతుంది. టేబుల్ వెరైటీలుగా చెప్పుకునే ఇమామ్ పసంద్ టన్ను ధర రూ.2.40 లక్షలు పలకాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.లక్ష పలుకుతోంది.



బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మామిడి కాయల ప్యాకింగ్







చంద్రబాబుకు పసుపు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని - కుప్పం నేతలు గౌనివారి, మునిరత్నంలతో ఎమ్మెల్సీ శ్రీకాంత్ - వేదికపై ఎమ్మెల్యేలు జగన్మోహన్ - అమరనాథరెడ్డి, మురళీమోహన్, నాని - తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకరరెడ్డి, పార్టీ అధ్యక్షులు సీఆర్. రాజన్, నరసింహయాదవ్

మహానాడులో నేతల సందడి




మహానాడు ప్రాంగణంలో టీడీపీ నేతలతో ఎమ్మెల్యేలు థామస్, భానుప్రకాశ్

చిత్తూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో తొలిరోజు చిత్తూరు, తిరుపతి జిల్లాల నేతలు కీలక పాత్ర పోషించారు.మహానాడు ప్రాంగణంలోకి చేరుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతినిధుల పేర్ల నమోదు చేసుకునే స్టాల్ వద్దకు రాగానే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన పేరు నమోదు చేయించి మహానాడు కిట్ అందజేశారు. మహానాడులో పార్టీకి తన వంతుగా రూ. 10,00,116 విరాళం అందజేశారు.శాప్ ఛైర్మన్ రవి నాయుడు కార్యకర్తల సంక్షేమం అనే అంశంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.తిరుపతి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర రెడ్డి ఈ తీర్మానాన్ని బలపరుస్తూ ప్రసంగించారు.గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్త జగదీష్‌కు చంద్రబాబు మహానాడు కిట్‌ను అందజేయడంతో ఆయన సంతోషానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి.శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా విభాగం యాక్టివిస్టు శశి మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం అనే అంశంపై తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం దక్కించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రసంగం ఆకట్టుకుంది. చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ తనయుడు వినీల్ యువనేత నారా లోకేశ్‌తో పాటు మాజీ మంత్రులు పరిటాల సునీత తనయుడు శ్రీరామ్, శోభానాగిరెడ్డి కుమారుడు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి తదితరులతో సన్నిహితంగా మసలుతూ ప్రాంగణంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ కనిపించారు.తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలపగా హోం మంత్రి అనిత, నందమూరి సుహాసిని తదితరులతో సూళ్లూరుపేట శాసనసభ్యురాలు విజయశ్రీ సన్నిహితంగా గడిపారు.మహానాడు నిర్వహణలో పలువురు నేతలు కీలక పాత్ర పోషిస్తున్నారు. తిరుపతి జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సమన్వయ కమిటీ సభ్యులుగా బిజీబిజీగా పనిచేస్తూ కనిపించారు.చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ మహానాడు సభ అలంకరణ కమిటీ కన్వీనర్‌గా, శాప్ ఛైర్మన్ రవినాయుడు వాలంటీర్ల నిర్వహణ కమిటీ కో కన్వీనర్‌గా, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ కో కన్వీనర్‌గా సేవలందించారు.అన్నమయ్య జిల్లా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి జనసమీకరణ కమిటీ సభ్యుడిగా,వసతి ఏర్పాట్ల కమిటీలో పులివర్తి వినీల్, పత్రికా, మీడియా మరియు సోషల్ మీడియా కమిటీ సభ్యులుగా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నీలాయపాలెం విజయ్‌కుమార్, రవాణా కమిటీ సభ్యులుగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం టీడీపీ ఇంఛార్జి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, రక్తదానం,మెడికల్ క్యాంపు కమిటీ సభ్యుడుగా జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.వి.థామస్, వలంటీర్ల నిర్వహణ కమిటీ సభ్యులుగా పీలేరుకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, మదన పల్లెకు చెందిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి బాబు బాధ్యతలు నిర్వర్తిస్తూ కన్పించారు.



శాప్ ఛైర్మన్ రవినాయుడి ప్రసంగం



చంద్రబాబుతో చల్లా రామచంద్రారెడ్డి తదితరులు



భీమనేని చిట్టిబాబు రక్తదానం

ఆర్టీసీ డిస్పెన్సరీ నిర్మాణం రెండు నెలల్లో పూర్తవ్వాలి

- ఎండీ ద్వారకా తిరుమలరావు



చిత్తూరు బస్టాండ్‌లో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

చిత్తూరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో జరుగుతున్న డిస్పెన్సరీ పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఎండీ ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. మంగళవారం చిత్తూరు పర్యటనలో భాగంగా ఆర్టీసీ బస్టాండును పరిశీలించారు. ముందుగా డిస్పెన్సరీ నిర్మాణ పనులను పరిశీలించి, కాంట్రాక్టరుకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, వారి కుటుంబీకులకు అందుబాటులో ఉండటానికే బస్టాండులో వైద్యశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బస్టాండులో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశాలిచ్చారు. సిబ్బంది సమస్యలను ప్రస్తావించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఈడీ ఆపరేషన్ అప్పలరాజు, ఈడీ ఇంజనీరింగ్ చెంగల్‌రెడ్డి, డీపీటీవో జగదీష్, డీఎం కృష్ణమూర్తి, సీఐ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.


వేరుశనగ విత్తనాల పంపిణీ ఎప్పుడో?

అవసరం 35 వేల క్వింటాళ్లు కాగా వచ్చింది సగానికంటే తక్కువే

చిత్తూరు సెంట్రల్, మే 27(ఆంధ్రజ్యోతి):రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వేరుశనగ విత్తనాల పంపిణీకి సమయం దగ్గర పడింది. అయితే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా విత్తనాలు రాకపోవడంతో పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటను 88,095 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇందుకోసం 35 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరం కాగా, ఇప్పటి వరకు 15,943 క్వింటాళ్లు మాత్రమే జిల్లాకు చేరాయి. వేరుశనగ విత్తనకాయల క్వింటాలు ధర రూ.9300 ఉండగా, రాయితీ రూ.3720 పోను రైతు వాటా కింద రూ.5580 చెల్లించాల్సి ఉంది. కే6 రకం సబ్సిడీ పోను 30 కిలోల బస్తా రూ.1674 ఉండగా, నారాయణి రూ.1710, లేపాక్షి రూ.1476గా ధరలు నిర్ణయించారు.

మండలాలకు కేటాయింపులు ఇలా...

రైతు సేవా కేంద్రాల ద్వారా వేరుశనగ విత్తనాలు సబ్సిడీపై అందించనున్నారు. ఇందుకోసం జిల్లాకు మంగళవారం వరకూ వచ్చిన 15,943 క్వింటాళ్ల విత్తనకాయల్ని మండలాల వారీగా కేటాయించారు. పుంగనూరు మండలానికి 1493.70 క్వింటాళ్లు, శాంతిపురానికి 1403.10, వి.కోటకు 1346.40, బైరెడ్డిపల్లెకు 1313.10, పెద్దపంజాణికి 1290, రామకుప్పానికి 1072.50, చౌడేపల్లెకు 1059, గంగవరానికి 933, సోమలకు 819, కుప్పానికి 749.70, సదుంకు 732, పులిచెర్లకు 718.50, రొంపిచెర్లకు 715.80, పలమనేరుకు 672, గుడిపాలకు 627, గుడుపల్లెకు 419.40, వెదురుకుప్పానికి 300, పెనుమూరుకు 278 క్వింటాళ్లు కేటాయించారు. అయితే ఎప్పట్నుంచీ పంపిణీ చేస్తారనే విషయాన్ని జిల్లా వ్యవసాయ శాఖాధికారులు నిర్ణయించలేదు.సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం రైతులు పట్టాదారు పాసుపుస్తకం చూపి నమోదు చేసుకోవాల్సి ఉంది. ఆపై రైతు సాగు చేసే పొలం ఆధారంగా నిర్దేశించిన గరిష్ఠ మొత్తం విత్తనాల కోసం టోకెన్ ఇచ్చిన తర్వాత, రైతులు సబ్సిడీ మొత్తం చెల్లించి, విత్తన కాయలు పొందాల్సి ఉంది.



వేరుశనగ విత్తనకాయలు

తిరుమలలో బాటగంగమ్మ జాతర


బాటగంగమ్మ


విశేష అలంకరణలో అమ్మవారి ఆలయం

తిరుమల, మే27(ఆంధ్రజ్యోతి): తిరుమల బాటగంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. పాపవినాశనం నడక మార్గంలోని బాటగంగమ్మ ఆలయంలో ఏటా స్థానికులు జాతర నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయాన్ని పుష్ప, ఫల, విద్యుత్ లైట్లతో శోభాయమానంగా అలంకరించారు. మంగళవారం ఉదయం 6 నుంచి 9 గంటల నడుమ అమ్మవారి నేత్ర దర్శనం జరిగింది. తర్వాత అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అలంకార దర్శనాలు మొదలయ్యాయి. జాతర సందర్భంగా తిరుమలతో పాటు తిరుపతి స్థానికులు బాటగంగమ్మను దర్శించుకున్నారు. అన్నదానం నిర్వహించారు.


భక్తులకు అన్నదానం

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.09 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,542
తలనీలాలు సమర్పించినవారు: 34,265





జస్టిస్ ఇందిరేష్ - దిల్ రాజు దంపతులు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈఎస్ ఇందిరేష్, సినీ నిర్మాత దిల్‌రాజు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కర్ణాటక మంత్రి శివరాజ్ ఉన్నారు. ఆలయం ముందు నిర్మాత దిల్‌రాజు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ మంచి దర్శన ఏర్పాట్లు చేస్తోందని, స్వామి ప్రసాదాలు చాలా బాగుంటున్నాయన్నారు.

నలుగురు దళారులకు కౌన్సెలింగ్


పోలీసుల అదుపులో దళారీలు

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): దర్శనాల పేరుతో భక్తులను మోసగించే నలుగురు దళారులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి తెలిపారు. ముక్కంటి ఆలయ పరిసరాల్లో భక్తులను మోసగించే దళారులపై సీఐ ప్రత్యేకంగా మంగళవారం నిఘా పెట్టారు. ఈ క్రమంలో నలుగురు యువకులు భక్తులకు మాయమాటలు చెప్పి దర్శనాలు చేయిస్తామని నమ్మిస్తుండగా సీఐ వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపించారు.

భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ, నిర్మాణ పనులను ప్రణాళికబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం చేపడుతున్న నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెక్టు పనులు, పురోగతిలో ఉన్న రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుట, పాకాల, తిరుపతి టౌన్‌కు సంబంధించి రైల్వే ప్రాజెక్టుపనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయిందన్నారు. ఇక జాతీయ హైవేలు తిరుపతి-తిరుత్తణి, సి.మల్లవరం-రేణిగుంట, నాయుడుపేట-తిరుపతి, పీలేరు-కలూరు, రేణిగుంట-కడప లైన్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐటీ జోనల్ మేనేజరు విజయ భరత్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ సురేంద్రనాయుడు, నేషనల్ హైవే పీడీలు రవీంద్రరావు, వెంకటేశ్వర్లు, వెంకటాచలపతి, ఆర్డీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మీరు ప్రతిభ సాధించి.. విద్యార్థులకు నేర్పించాలి

- ఉమ్మడి జిల్లా డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లకు డీఈవో సూచన
- డీఆర్పీలకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు ప్రారంభం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో కుమార్

తిరుపతి(విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంలో ప్రతిభ సాధించి.. వారికి నేర్పించాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లకు (డీఆర్పీ) డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. డీఆర్పీలకు ఆరు రోజులపాటు జరిగే ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై శిక్షణ తరగతులను మంగళవారం తిరుపతిలో డీఈవో ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు భాష, గణితంపై పట్టు కలిగేలా ఆటపాటలతో ఆసక్తికరంగా బోధించాలన్నారు. అటువంటి నైపుణ్యాలను డీఆర్పీల్లో కలిగించేందుకే ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ బోధన నైపుణ్యాలను పెంపొందించుకుని మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు మాట్లాడుతూ.. రాయడం, చదవడం వంటి కనీస అభ్యసన స్థాయిలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు డీఆర్పీల నుంచి ఉపాధ్యాయుల వరకు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో తిరుపతి జిల్లా నుంచి 102 మంది, చిత్తూరు జిల్లా నుంచి 93 మంది డీఆర్పీలకు 16 మంది కేఆర్పీలు శిక్షణ ఇస్తారని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, స్టేట్ ప్రథం కోఆర్డినేటర్ కన్నయ్యనాయుడు, చిత్తూరు జిల్లా అసిస్టెంట్ ఏఎంవో సుభాషిణి, తిరుపతి జిల్లా సమగ్రశిక్ష అల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

డ్రోన్‌కు చిక్కారిలా..

తిరుపతి(నేరవిభాగం), మే 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పరిధిలో సోమవారం అర్ధరాత్రి అధునాతన మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్‌తో నైట్ బీట్ నిర్వహించారు. సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. దామినేడు పరిధిలో అటుగా వెళుతున్న వాహనాలను కొందరు హిజ్రాలు ఆపి ఇబ్బంది పెడుతున్న దృశ్యాలను డ్రోన్ కెమెరాలతో గుర్తించారు. అక్కడికి పోలీసులు చేరుకుని ప్రశ్నించారు. ఇక్కడకు ఊరికే వచ్చామని వారు సమాధానం చెప్పారు. రాత్రి సమయాల్లో ఎక్కడ పడితే అక్కడ ఉండకూడదని హెచ్చరించి పంపారు. వాహనదారులు, ప్రజలను ఇబ్బంది పెడితే కేసులు నమోదు చేస్తామని వారిని హెచ్చరించారు. అలిపిరి పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, జూదం ఆడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు.



ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- 13 కిలోల గంజాయి స్వాధీనం


స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అరెస్టు చూపారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ... ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి రవాణాపై నిఘా పెట్టామన్నారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో సోమవారం సాయంత్రం పట్టణ శివార్లలోని చెన్నై రహదారిపై గంజాయి రవాణా సాగుతున్నట్లు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారన్నారు. తమిళనాడుకు చెందిన మురళి, శ్యామ్‌రాజ్, సంజయ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు యువకులు ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయి స్మగ్లింగ్ చేస్తుంటారన్నారు. ఈ క్రమంలో గంజాయిని తమిళనాడుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోని శ్రీకాళహస్తి వద్ద దాడి చేశామన్నారు. మురళి, శ్యామ్‌రాజ్, సంజయకుమార్ 13 కిలోల గంజాయితో పట్టుబడగా మరో ఇద్దరు పరారయ్యారన్నారు. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన సీఐ నాగార్జునరెడ్డి, ఎస్ఐ పార్థసారథి, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, నందకుమార్, రేగాన్‌ను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

ఆర్టీసీ బస్సులను సమయపాలన ప్రకారం నడపాలి


ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో శుభ్రత పాటించి బస్సులను సమయపాలన ప్రకారం నడపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వీసీ ద్వారా జిల్లాలోని ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. బస్‌స్టేషన్‌లో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి మరుగుదొడ్ల నిర్వహణ బాగుండలన్నారు. బస్సులు అన్ని కండిషన్లలో ఉండేలా ఎప్పటికపుడు మరమ్మతులు చేపట్టాల్నారు. బస్‌స్టేషన్ ఆవరణలోని దుకాణాల్లో నిర్ణీత ధరలకే వస్తువులను అమ్మాలన్నారు. ఈ నిబంధనలు అతిక్రమించిన దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి వెంకట్రావు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మహానాడు సంబరం




కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.



ఇంద్రవరదుడి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



అంకురార్పణ ఘట్టం - ప్రత్యేక అలంకరణలో విష్వక్సేనుడు

యాదమరి, మే 27 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని త్రివేణి సంగమంలో వెలసి ఉన్న శ్రీదేవి, పెరిందేవి సమేత వరదరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. 12 రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చన, కైంకర్యాలు, పూజలు చేశారు. సాయంత్రం అంకురార్పణ జరగ్గా.. రాత్రి బ్రహ్మోత్సవాలకు ఆరంభ సూచకంగా సకల దేవతలకు, అష్టదిక్పాలకులకు ఆహ్వానం పలుకుతూ గ్రామంలో విష్వక్సేన ఉత్సవం నిర్వహించారు. కాగా బుధవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి చంద్రప్రభ వాహన సేవ జరగనుంది.

ఎరువుల డీలర్లకు ఈ-పోస్ యంత్రాల పంపిణీ


వ్యవసాయశాఖ కార్యాలయానికి వచ్చిన ఎరువుల డీలర్లు

చిత్తూరు సెంట్రల్, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల దుకాణం డీలర్లకు జిల్లా వ్యవసాయ శాఖాధికారులు మంగళవారం కార్యాలయంలో ఈ-పోస్ యంత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్ మిషన్ కింద ఆర్‌సీఎఫ్ కంపెనీ ద్వారా జిల్లాలోని 225 మంది ఎరువుల డీలర్లకు కొత్త సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్రాలను అందజేశారు. వీటివల్ల బయోమెట్రిక్ ద్వారా ఎరువులు కొనుగోలు చేసే వీలుంటుందన్నారు. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీని రైతులు పొందే వెసులుబాటు ఉంటుంది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, మాంగనీజ్, భాస్వరం, పొటాషియం, క్లోరిన్, జిప్సం, మెగ్నీషియం, తదితర ఎరువులను రైతులు సబ్సిడీ ధరలకు పొందవచ్చు.

మత్స్యకారులకు వలలు, బోట్లు


చేపలు పడుతున్న మత్స్యకారుడు

చిత్తూరు సెంట్రల్, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మత్స్యకారులకు వలలు, బోట్లు ఇచ్చేందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పీఎం మత్స్యసంపద యోజన కింద జిల్లాలోని మత్స్య కారులకు వీటిని ఇవ్వనున్నారు. జిల్లాలో 20 మత్స్యకారుల సొసైటీలు ఉన్నాయి. వీటి ద్వారా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 47 చెరువులకు 3.30 లక్షల చేపలు అందజేశారు. తాజాగా వంద మందికి చేపలు పట్టే వలలు, మరో వంద మందికి బోట్లు ఇవ్వడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాగానే వీటిని లబ్ధిదారులకు అందజేయనున్నట్లు మత్స్యశాఖాధికారులు తెలిపారు.

చోరీ కేసులో ఆరునెలల జైలు


నిందితుడు రామ్మోహన్

పూతలపట్టు, మే 27 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష పడింది. బంగారుపాళ్యం మండలం నలగాంపల్లె పంచాయతీ పాపదేశివారికండ్రిగ గ్రామంలో వినాయక స్వామి గుడి ఉంది. ఈ గుడిలోని హుండీని 2023 మార్చి 31వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని రూ.2వేలను చోరీ చేశారు. స్థానికుల ఫిర్యాదుతో బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అనంతపురం జిల్లా కదిరికి చెందిన రామ్మోహన్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో వాయిదాకు రాగా, న్యాయమూర్తి ఉమాదేవి పూర్వాపరాలు పరిశీలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పాము కాటుతో 'తెలుగు మహిళ' మృతి


మంజుల (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, మే 27 (ఆంధ్రజ్యోతి): పాము కాటుతో తెలుగు మహిళా నాయకురాలు ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం పాతగుంట గ్రామ పంచాయతీ మాకయ్యగారిపేటకు చెందిన ఎ.మంజుల(37) తెలుగు మహిళ విభాగంలో కుటుంబ సాధికార సమితి నాయకురాలుగా ఉన్నారు. మంగళవారం ఇంటి ఆవరణంలో పనులు చేసుకుంటుండగా పాము కరిచింది. వెంటనే బంధువులు పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు బంధువులు తెలిపారు.

ముగిసిన ఏపీ ఈఏపీ సెట్

చిత్తూరు సెంట్రల్, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక ఎస్వీ సెట్, సీటమ్స్, వేము కళాశాలల్లో ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభమైన ఏపీ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏపీ ఈఏపీ సెట్) మంగళవారంతో ముగిసింది. చివరి రోజున ఒకే సెషన్‌లో నిర్వహించిన పరీక్షల్లో 608 మందికి 575 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా, మొత్తం పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు 7,879 మందికి 7,387 మంది హాజరవగా, 492 మంది గైర్హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 1,746 మందికి 1,585 మంది, ఇంజనీరింగ్, ఫార్మసీ విభాగంలో 6,133 మందికి 5,802 మంది పరీక్షలు రాశారు.

ఎస్‌ఏల ధ్రువీకరణ పత్రాల పరిశీలన


ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న కౌంటర్ సభ్యులు

చిత్తూరు సెంట్రల్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రేడ్-2 హెచ్ఎంల పదోన్నతికి సంబంధించి స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)ల ధ్రువీకరణ పత్రాల పరిశీలన మంగళవారం స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. 150 పోస్టులకు 1:3 రేషియోలో సుమారు 500 మంది ఎస్‌ఏలను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచారు. కంబైన్డ్ పదోన్నతి సీనియారిటీ జాబితా ప్రకారం జడ్పీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పరిధిలోని ఎస్‌ఏలు, తత్సమాన కేడర్లకు సంబంధించిన వారి విద్యార్హత సర్టిఫికెట్లు, సర్వీసు బుక్స్ పరిశీలన చేసినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఎస్‌ఏలు ఇబ్బంది పడకుండా 20 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

జంట ఏనుగుల స్వైరవిహారం

● పంటల ధ్వంసం




ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు, నేలరాల్చిన కాయలు, ధ్వంసమైన కొబ్బరి చెట్టు, టమోటా తోట

రామకుప్పం, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలో తిరిగి జంట ఏనుగుల దాడులు ప్రారంభమయ్యాయి. నెల రోజుల క్రితం తమిళనాడు నుంచి వచ్చిన ఇవి రామాపురంతాండా, నారాయణపురంతాండా, జీడిమాకులపల్లె, చింతమానత్తం, సింగసముద్రం గ్రామాల సమీప పొలాలపై దాడుల పరంపరం కొనసాగించాయి. అటవీ అధికారులు, ట్రాకర్స్ అతి కష్టం మీద పదిహేను రోజుల క్రితం కర్ణాటక అడవుల వైపు తరిమేశారు. సరిహద్దులు దాటి వెళ్ళిపోయాయని అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి రామకుప్పం అడవుల్లోకి ప్రవేశించాయి. నారాయణపురంతాండా సమీప తోటలు, పంటలపై దాడి చేశాయి. జైపాల్‌నాయక్ తోట 15మామిడి చెట్ల ధ్వంసం చేశాయి. కొమ్మలను విరిచేశాయి. మామిడికాయలను తిని, మరికొన్నింటిని నేలపాలు చేశాయి. ఆనందనాయక్‌కు చెందిన బీన్స్ అయ్యానాయక్ టమోటా తోటలను కూడా ధ్వంసం చేశాయి. నాగానాయక్‌కు చెందిన పశుగ్రాసాన్ని తొక్కేశాయి. కొబ్బరిచెట్టును ధ్వంసం చేశాయి. ట్రాకర్స్‌తో కలిసి ముద్దనపల్లె అటవీబీట్‌లోకి ఏనుగులను మళ్లించినట్టు ననియాల అటవీ విభాగాధికారి హరికుమార్ తెలిపారు. రాత్రివేళ అటవీమార్గంలో రాకపోకలు సాగించరాదని, రైతులెవరూ పొలాల వద్దకు వెళ్ళరాదని సూచించారు. ఏనుగులు పొలాల వైపు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఆగని గజ బీభత్సం


ధ్వంసమైన బోరు మోటర్

సోమల (ఆంధ్రజ్యోతి): రాంపల్లె బీట్ సమీపంలోని బాబురెడ్డి టమో టా, మామిడి తోటల్లో సోమవారం రాత్రి ఏనుగులు స్వైర విహారం చేశా యి. బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసంచేశాయి. ఊత కర్రల ను విరిచేశాయి, బోరు, డ్రిప్ పరికరాలను తొక్కేశాయి. కోతకు సిద్ధంగా ఉన్న టమోటా తోటల్లో బీభత్సం చే శాయని బాధిత రైతులు వాపోతున్నారు. చీకలవారిపల్లె నుంచి ఐరాల మ ండలం వైపు వెళ్లిన ఏనుగుల మంద ఒక్క రోజులోనే తిరిగి సోమల మండలంలోకి ప్రవేశించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా వీటి సంచారంతో టమోటా తోటల్లో కాయలు కోయడంలేదని వీరు చెబుతున్నారు.

బదిలీల నుంచి తప్పించేందుకు

రాత్రికి రాత్రి యూనియన్ ఎన్నికలు!

చిత్తూరు రూరల్, మే 27: బదిలీ నుంచి కొంతమందిని తప్పించేందుకు ఓ సంఘం రాత్రికి రాత్రే కార్యవర్గాన్ని ఎంపిక చేసింది. ఎటువంటి నోటిఫికేషన్, ఎన్నికల అధికారి లేకుండానే ఎన్నికలను ఏకగ్రీవం చేసి పారేసింది. ఆదివారం రాత్రి కార్యవర్గ సభ్యులతో కలిసి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డు పైనున్న సమావేశ మందిరంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసింది. ఎప్పుడో ఎన్నికలు జరిపినట్లు మినిట్స్‌లో నమోదు చేసిన విషయం ఆలస్యంగా బయటకు వచ్చింది. ఇటీవల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఐదేళ్ల , మూడేళ్ల దాటిన ఉద్యోగుల జాబితాను అధికారులు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ఏపీ వైద్య విధాన పరిషత్‌లో నేడో, రేపో బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు వెలువడనున్నాయి.అయితే తమకున్న ఇన్‌ఫ్లుయన్స్‌తో ఒకే చోట చాలాకాలంగా పాతుకుపోయిన వారు బదిలీ అయ్యేందుకు ఇష్టపడడం లేదు. యూనియన్ ఆఫీస్ బేరర్లకు బదిలీల్లో మినహాయింపు ఉండడాన్ని అదునుగా చేసుకున్న ఓ సంఘం నాయకుడు రాత్రికి రాత్రే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సమావేశం ఏర్పాటు చేసి తాలుకా యూనిట్ కార్యవర్గాన్ని ఎన్నిక చేసి పదవులు ఇచ్చారు. దీని కోసం ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.ఎన్నికలకు నోటిఫికేషన్, లేకనే అదీ బదిలీల సమయంలో ఎన్నికలు జరపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చాలా ఏళ్లుగా బయట పనిచేస్తూ చిత్తూరు రావాలని ప్రయత్నిస్తున్న ఉద్యోగులు ఈ విషయం తెలిసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కూల్చేసిన ఇళ్లు - ఆందోళనకు దిగిన బాధితులు

అర్ధరాత్రి అరాచకం

● పేదల ఇళ్లు 80 నేలమట్టం
● బంగారు, నగదు లాక్కున్న దుండగులు

తిరుపతి(ఉపాధ్యాయ నగర్), మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీ వేణుగోపాల్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి దుండగులు అరాచకానికి పాల్పడ్డారు. 80 ఇళ్లను నేలమట్టం చేశారు. బాధితుల కథనం మేరకు.. ఈ కాలనీలో సుమారు 100 చిన్న, మధ్య తరగతి కుటుంబాలు ఉంటున్నాయి. చిన్నపాటి స్థలాలను కొని.. ఇళ్లు కట్టుకుని.. 10-15 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో దాదాపు 300 మంది.. ఏడు ఎక్స్‌కవేటర్లతో కాలనీకి వచ్చారు. మద్యం మత్తులో ఉన్న వీరు ఇళ్లలో చొరబడి బూతులు తిట్టారు. అందరినీ బయటకు పంపారు. చేతికందిన వస్తువులను, బీరువాల్లోని నగలు, నగదును దోచుకున్నారు. గంటలోపే దాదాపు 80 ఇళ్లు నేలమట్టం చేశారు. తమను ఎదిరించిన వారిని దుండగులు చితకబాదారు. పోలీసులకు ఫోన్ చేయబోతే సెల్‌ఫోన్‌లు లాక్కొన్నారు. ఆ సమయంలో ఇద్దరు కానిస్టేబుళ్లు ఘటనా స్థలానికి వస్తే వారిపైనా దౌర్జన్యం చేశారు. వారు వెళ్లి తిరుచానూరు సీఐతో ఘటనా స్థలానికి వచ్చారు. అప్పటికే దుండగులు వెళ్లిపోయారు.

వివాదం నేపథ్యమిదీ!

చెన్నాయగుంట గ్రామ లెక్కదాఖలా సర్వే నంబర్ 218/1లో 1.64 ఎకరాల్లో సుమారు వంద ప్లాట్లు ఉన్నాయి. శ్రీనివాసులురెడ్డి, రుద్రగోపి వద్ద వీరు 2011 నుంచి ఈ స్థలాలను కొన్నారు. ఈ స్థలం తమదంటే తమదంటూ రెండు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. హైకోర్టు, ఆర్డీఓ కోర్టు, జిల్లా కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని రుద్రగోపి మీడియాకు చెప్పారు. కోర్టులో వేసిన కేసులను వెనక్కు తీసుకోవాలని నిర్మల, రాజన్‌బాబు, మునిరెడ్డి మరికొందరు మూడు నెలలుగా తనపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. వారే ఈ ఇళ్లను కూల్చివేయించి ఉంటారని రుద్రగోపి చెప్పారు.

మాకు న్యాయం చేయండి

స్థల వివాదాలేవీ తమకు తెలియదని కాలనీ వాసులు చెబుతున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించాకే స్థలాలను కొన్నామని, కొందరు బ్యాంకు రుణాలూ తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పుడిలా అర్ధరాత్రి ఇళ్లు కూల్చి తమను నిరాశ్రయులను చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. నగదు, నగలూ దోచుకున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. తమకు న్యాయం చేయాలంటూ శిథిలాల వద్ద నిరసన తెలిపారు. కాగా, సదరు స్థల యజమానులు తమ స్థలంపై పలువురికి జీపీఏలు ఇవ్వడమే ఈ పరిస్థితికి కారణమన్న ప్రచారం ఉంది.

ఇళ్లు కూల్చినవారిపై కేసులు పెట్టండి

తిరుపతి(ఆటోనగర్)/తిరుచానూరు, ఆంధ్రజ్యోతి: వేణుగోపాల్ కాలనీలో ఇళ్లు కూల్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వై.వెంకటేశ్వర రావు, జిల్లా కార్యదర్శి వి.నాగరాజు డిమాండ్ చేశారు. ఇళ్లు కూల్చిన ప్రాంతాన్ని మంగళవారం వీరు పరిశీలించారు. జరిగిన నష్టాన్ని కూల్చిన వారి నుంచి కట్టించాలని కోరారు. సీపీఎం నాయకులు కందారపు మురళి, వేణుగోపాల్, ఎస్.జయచంద్ర, సాయిలక్ష్మి, మోదీన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇళ్లు కూల్చిన వారిపై కేసులు నమోదు చేయాలంటూ సీపీఎం నాయకులు సుబ్రహ్మణ్యం, జయచంద్ర, వేణుగోపాల్, సుమన్, బుజ్జి తదితరులు తిరుచానూరు సీఐకి వినతిపత్రం ఇచ్చారు.

రెండు హోం స్టేల లైసెన్సుల రద్దుకు అనుమతి ఇవ్వండి

తిరుపతి(నేరవిభాగం), మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వ్యభిచార గృహాలుగా వాడుతున్న రెండు హోం స్టేల లైసెన్సులు రద్దు చేసి, సీజ్ చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆర్డీవోకు అలిపిరి సీఐ రాంకిషోర్ లేఖ రాశారు. ఇందులో దుర్గా హోం స్టేలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. నిర్వాహకుడు వెంకటేష్‌తో పాటు రమణయ్యను మంగళవారం కోర్టులో హాజరుపరచగా వారికి న్యాయమూర్తి రిమాండ్‌కు విధించారు. అలాగే గతేడాది నవంబరులో ఇదే తరహాలో సెవెన్ హిల్ హోం స్టేలో వ్యభిచార కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. దీనిపై నిర్వాహకులను అరెస్టు చేశారు. ఈ రెండు హోం స్టేల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు శాశ్వతంగా సీజ్ చేయడానికి ఆర్డీవో రామ్మోహన్‌రావుకు ప్రతిపాదనలు పంపారు. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడైనా అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ రాం కిషోర్ విజ్ఞప్తి చేశారు.

2 నుంచి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈఓ తదితరులు

తిరుమల, మే27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు జూన్ 2 నుంచి 10 వరకు జరగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవలుంటాయి. 1న సాయంత్రం 5.30 గంటలకు అంకుర్పాణతో ఉత్సవాలు ప్రారంభకానున్నాయి. 2న ఉదయం 7.02 నుంచి 7.20 గంటల నడుమ మిథున లగ్నంలో ధ్వజారోహణం జరగనుంది. ఇక, రాత్రి 7 గంటలకు పెద్దశేవాహనం, 3న ఉదయం చిన్నశేష, రాత్రి హంస, 4న ఉదయం సింహ, రాత్రి ముత్యపుపందిరి, 5న ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి సర్వభూపాల, 6న ఉదయం మోహినీఅవతారం, రాత్రి గరుడవాహనసేవలు జరుగనున్నాయి. అలాగే 7న ఉదయం హనుమంత, రాత్రి గజవాహనం, 8న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 9న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనసేవలు జరుగనున్నాయి. చివరిరోజు 10వ తేదీన ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణం నిర్వహిస్తారు.

ఈవోచే పోస్టర్ ఆవిష్కరణ

బ్రహ్మోత్సవాల వివరాలు, ఫొటోలతో కూడిన పోస్టర్‌ను తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో కలిసి ఈవో శ్యామలరావు ఆవిష్కరించారు. వేసవి నేపథ్యంలో బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ప్రాంగణంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులతో సమీక్షించారు. వాహనసేవల సమయంలో గాంధీరోడ్డు, కర్నాల వీధుల్లో అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రధాన రహదారుల్లో ఆర్చీలు, స్వామివారి వాహనసేవలను భక్తులు తిలకించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షలో టీటీడీ ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, ఎస్ఈ వేంకటేశ్వర్లు, డిప్యూటీఈవోలు శాంతి, లోకనాథం, సెల్వం, సీఎంవో నర్మద, ఆల్ ప్రాజెక్టుల పీవో రాజగోపాల్, ఏఈవో మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రానికే మోడల్‌గా కుప్పం డిపో

● ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు


కడా పీడీతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

కుప్పం, మే 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపోను రాష్ట్రానికే మోడల్ డిపోగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు అన్నారు. మంగళవారం ఆయన కడా పీడీ వికాస్ మర్మత్‌తో కలిసి ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. అన్ని విభాగాలను సందర్శించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఎండీ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గంలోని డిపోలో అధునాతన సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడుతూ, వారి సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు బకాయిలు చెల్లించడానికి త్వరలోనే ఆదేశాలిస్తామన్నారు. కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పం డిపోలో త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో గ్రీన్ ఎనర్జీ దిశగా ఆర్టీసీ డిపోను అభివృద్ధి పరచి, ప్రయాణికులకు కాలుష్య రహిత సుఖవంతమైన రవాణా సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు ఆర్టీసీ ఎండీ, కడా పీడీలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు చెంగల్‌రెడ్డి, అప్పలరావు, కుప్పం డిపో మేనేజరు గోపీనాథ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకుముందు ఎండీ పలమనేరు డిపోను సందర్శించారు.

ల్యాబ్ నిర్వహణకు వచ్చిన

నిధుల్లో కమీషన్లు!

● ఒక్కో పీహెచ్‌సీ నుంచి రూ.5 వేల దాకా వసూళ్లు
● డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఓ అధికారి నిర్వాకం


చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం

చిత్తూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఓ అధికారి తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.కాసులివ్వనిదే ఎమ్మెల్యే చెప్పినా పనిచేయరన్న పేరెత్తుకున్న ఆయన ఇటీవల ల్యాబ్ నిర్వహణకు వచ్చిన నిధుల్లోనూ కమీషన్లు రాబట్టారన్న విషయం బయటపడింది. జిల్లాలోని 65 పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలల్లో ల్యాబ్ నిర్వహణకు ప్రభుత్వం రూ.15 వేల చొప్పున నిధులు విడుదల చేసింది.ల్యాబ్‌కు కావాల్సిన పరికరాలు, పరీక్షల్లో వాడే కెమికల్స్, గ్లౌజులు తదితర పరికరాల కొనుగోలుకు ఈ నిధులు వాడాల్సి ఉంటుంది. అయితే ఈ నిధులను మంజూరు చేసినందుకు గాను పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నుంచి రూ.5 వేల చొప్పున ఆ అధికారికి ముట్టజెప్పారు. ఈ విషయం కలెక్టర్ వరకు వెళ్లడంతో విచారణ జరుపుతున్నట్లు సమాచారం.ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ఎఫ్ఎన్‌వోలు కొంతమంది ఇటీవల ఆ అధికారిని కలిశారు. వచ్చే రూ.15 వేలు జీతం ఛార్జీలకు, అక్కడవుంటే రూముకు, భోజనాలకు సరిపోవడం లేదని చెప్పుకున్నారు. చిత్తూరు పరిసర ప్రాంతాలకు డిప్యుటేషన్ వేయాలని కోరారు. దీంతో వారి నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేసి డిప్యుటేషన్లు వేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ, పీజీ పరీక్షా ఫీజు నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ, డిప్లొమా పరీక్షల నోటిఫికేషన్ విడుదలైంది. ఫీజు చెల్లించేందుకు ఈ నెల 31వ తేదీ దాకా గడువు విధించారు. రూ. 500 అపరాధ రుసుంతో జూన్ 20 వరకు అవకాశం కల్పించినట్లు ఆ వర్సిటీ తిరుపతి రీజియన్ కో-ఆర్డినేటర్ మల్లికార్జునరావు తెలిపారు. ఇతర వివరాలకు 73829 29617 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

తిరుమలలో చెప్పుల భద్రతకూ ఆర్‌ఎఫ్‌ఐడీ


భక్తుడి వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

తిరుమల, మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల కొండమీద భక్తులు వదిలేసిన చెప్పులు కుప్పలుగా పేరుకుపోతుంటాయి. వారానికి ఒక లారీ చెప్పులను వ్యర్థాల కింద తరలించాల్సి వస్తోంది. పాదరక్షల సంరక్షణ కేంద్రంలో దాచిన చెప్పులను తిరిగి వెతుక్కోవడం కూడా పెద్ద చిక్కుగా మారుతుంటుంది. దీంతో ఆధునిక సాంకేతికత సాయంతో ఆర్‌ఎఫ్ఐడీ(రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) విధానాన్ని అనుసరించాలని టీటీడీ నిర్ణయించింది. లగేజీ, సెల్‌ఫోన్లను భద్రపరిచేందుకు ప్రస్తుతం ఈ విధానాన్నే అనుసరిస్తున్నారు. కొత్త విధానం ప్రకారం చెప్పుల కేంద్రంలో భక్తుల చెప్పులు దాచే బ్యాగ్‌కు టోకెన్ల బదులుగా ఆర్‌ఎఫ్ఐడీ ట్యాగ్ ఉంటుంది. వారి మొబైల్ నెంబర్ కూడా నమోదవుతుంది. ఇందువల్ల చెప్పులు ఏ వరుసలో, ఏ ర్యాక్‌లో ఉన్నాయో దానిని స్కాన్ చేయడం ద్వారా వెంటనే తెలిసిపోతుంది. ఒకవేళ భక్తులు ఎవరైనా ఏ కేంద్రంలో చెప్పులు దాచారో మరచిపోయినా వెంటనే మొబైల్ ద్వారా సమాచారం పంపుతారు. ఇందువల్ల తిరుమలలో చెప్పుల వ్యర్థాలు తగ్గిపోతాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్2 ముందున్న చెప్పుల కౌంటర్‌లో ఈ విధానాన్ని కొద్దిరోజులుగా ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నారు. త్వరలో మరికొన్ని ప్రాంతాల్లో అమలుచేయాలని టీటీడీ భావిస్తోంది.

వారపు సంత.. కనీస వసతులకు చింత



సోమల రోడ్డుపైనే వారపు సంత దుకాణాలు

సోమల, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంతకు ఏటా లక్షల రూపాయల ఆదాయం చేకూరుతున్నా కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. సోమల- చౌడేపల్లె ప్రధాన రహదారి పక్కన ప్రతి శనివారం సంత నిర్వహిస్తున్నారు. దీని వేలం పాటలతో ఏటా రూ.5 లక్షల మేర ఆదాయం వస్తుంది. సమీప, దూర గ్రామప్రజలు, రైతులు అధిక సంఖ్యలో వస్తున్నారు. కనీసం తాగడానికి చుక్క నీరు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాల నుంచి సరుకులు తెచ్చుకుని వ్యాపారం చేసే వారికి కనీస సౌకర్యాలు లేవు. షెల్టర్లులేక వ్యాపారస్తులే గుడారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దుకాణదారులకు తగినంత స్థలంలేక పోవడంతో తిరుపతి - పుంగనూరు రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మూత్రశాలలు ఏర్పాటు చేసినా నీటి సౌకర్యం కల్పించలేదు. అధికారులు స్పందించి వేసవి దృష్ట్యా తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న కీచకవధ ఘట్టం

సోమల, మే 27 (ఆంధ్రజ్యోతి): నంజంపేట గార్గేయ నదీతీరం గార్గేయ గౌరీలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా మంగళవారం భాగవతారణి రత్నకుమారి ప్రదర్శించిన కీచకవధ ఘట్టం భక్తులకు అలరించింది. రాత్రి రాయలపేట నాటకమండలి కీచకవధలోని ముఖ్య ఘట్టాలను ప్రదర్శించారు. సోమల, కమ్మపల్లె, నంజంపేట, గట్లువారిపల్లె, ఆవులపల్లె తదితర గ్రామాల భక్తులు పాండవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త గుత్తా జయలలితమ్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పలమనేరులో సీపీఎం సమైక్యతా యాత్ర



పలమనేరు, మే27 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదం నశించాలని, భారత్‌పై అమెరికా పెత్తనం నశించాలని, దేశసమైక్యతను కాపాడాలని కోరుతూ పలమనేరులో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం సమైక్యతాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని పిలుపు నిచ్చారు. ఉగ్రవాదాన్ని మతాలకు అతీతంగా చూడాలన్నారు. అధికార బీజేపీ ఉగ్రవాదాన్ని కూడా మతాన్ని అడ్డుపెట్టుకొని రెచ్చగొట్టేపని చేయడం దుర్మార్గమన్నారు. పలమనేరు సీపీఎం కార్యదర్శి గిరిధర గుప్తా, పట్టణ నాయకులు లక్ష్మయ్య, ధనలక్ష్మి, శ్రీరాములు, హైదర్‌వల్లీ, సుధాకర్ పాల్గొన్నారు.

మహానాడు సభకు ప్రత్యేక బస్సుల ఏర్పాటు

సోమల, మే 27 (ఆంధ్రజ్యోతి): కడపలో 29వ తేదీ జరిగే మహానాడు బహిరంగ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో వెళ్లడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. మంగళవారం కందూరు, నంజంపేట, ఆవులపల్లె, నెల్లిమంద, సోమల పంచాయతీల్లో కార్యకర్తలను కలసి మహానాడు కార్యక్రమంపై సమీక్షించారు. మండలం నుంచి 15 బస్సులు, 50 ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివశంకర్, మహేంద్రబాబు, వేణుగోపాల్ నాయుడు, భానుప్రకాశ్, ఉమాపతినాయుడు, హరిప్రసాద్, మదన్‌మోహన్‌రెడ్డి, రమేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహవంతులకు యోగా శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణ

సోమల, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో ప్రశాంతత, మానసిక శారీరక ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగా శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు యోగాపై అవగాహన కల్పించడానికి ఉత్సాహవంతులను నమోదు చేసుకొని మాస్టర్ ట్రైనీలతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. ఏపీవో షౌకత్, ఏపీఎం శివ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



అమ్మవారికి బోనాలు తీసుకువస్తున్న మహిళలు

రొంపిచెర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) చెంచమరెడ్డిగారిపల్లెలో గంగజాతర సందర్భంగా గ్రామదేవతకు మంగళవారం పూజలు చేశారు. మహిళలు ఊరేగింపుగా బోనాలు తీసుకొచ్చి చీర సారె, పొంగళ్ల పెట్టి కొలిచారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘునాథ, చంగల్‌రెడ్డి, ఈశ్వరయ్యలు పాల్గొన్నారు.

రేషన్ తూకాల్లో తేడా వస్తే చర్యలు



రొంపిచెర్ల తహసిల్దార్‌ను సత్కరిస్తున్న డీలర్లు

సోమల, మే 27 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాల్లో రేషన్ బియ్యం తూకాల్లో వ్యత్యాసం వస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ బెన్నురాజ్ హెచ్చరించారు. మంగళవారం మండల డీలర్లతో సమావేశం నిర్వహించారు. జూన్ 1న పండుగ వాతావరణంలో నిత్యావసర సరుకులు అందజేయాలన్నారు. . 65 ఏళ్ల పై బడిన కార్డుదారులకు, వికలాంగులకు ఇంటికే బియ్యం అందజేయాలన్నారు. సమావేశంలో డీటీ మధుసూదన్, ఆర్ఐ సుబుక్తుల్లా, డీలర్లు పాల్గొన్నారు. **రొంపిచెర్ల:** చౌకదుకాణం డీలర్లు మంగళవారం తహసిల్దార్ కిరణ్‌కుమార్‌ను సత్కరించారు. ఈసదంర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 28 డీలర్ షాపుల్లో 8,118 రేషన్ కార్డులకు నిత్యావసర సరుకులు జూన్ 1వతేదీ నుంచి ఇవ్వాలన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 వరకు, సాయంత్రం 4నుంచి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం



ధ్వజావరోణం నిర్వహిస్తున్న అర్చకులు

వెదురుకుప్పం, మే 27 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శాస్త్రోక్తంగా చక్రస్నానం జరిగింది. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. చూర్ణాభిషేకం చేశాక భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. తర్వాత స్వామి వారిని పల్లకిలో పుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. స్నపన తిరుమంజనం నిర్వహించాక, చక్రస్నానం జరిగింది. నవసంధి, మాడ వీధి ఉత్సవం, ధ్వజావరోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. యాగశాలలో పూర్ణాహుతి, కుంభం వేంచేపు, ప్రత్యేక గంట కంకణ భట్టాచార్యుల బహుమానం జరిగింది. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబు సురేష్, కంకణ భట్టార్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణదాసరి, గోపాలాచారి, శబరీష్, పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ

సోమల, మే 27 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, పరిసరాలను పరిశుభ్రత పాటించాలని పెద్ద ఉప్పరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలాజీ సూచించారు. మంగళవారం ఆవులపల్లె, గాంధీనగర్ 104 సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వచేసిన తినుబండారాలు తినరాదన్నారు. మంచినీరును కాచి వడపోసి తాగాలన్నారు. రాబోవు వర్షాకాలంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హేమలత, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి సమాధి వద్ద ఆత్మహత్య



చంద్రమోహన్ (ఫైల్‌ఫొటో)

పలమనేరు, మే27 (ఆంధ్రజ్యోతి): మాదిగబండ గ్రామానికి చెందిన చంద్రమోహన్ (40) ఆత్మహత్య చేసుకున్నాడు మంగళవారం గ్రామసమీపంలోని తండ్రి సమాది వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇతడి ఆత్మహత్యకు కారణాలు పోలీసుల దర్యాప్తుతో తేలాల్సివుంది.

యువకుడి అదృశ్యం

పెద్దపంజాణి, మే 27(ఆంధ్రజ్యోతి): సోదరి ఇంటికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. పెదపంజాణీ పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన హోటల్ నిర్వహిస్తున్న నాగరాజు కుమారుడు గణేష్ సోమవారం ఊరికి వెళ్ళి అక్కను చూసొస్తానని వెళ్లాడు. అప్పటి నుండి ఆచూకీ లేకపోవడంతో అతని తల్లి ద్రాక్షాయణి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. .

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పుంగనూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): పుంగనూరు-ముళబాగల్ మార్గంలోని సొనేపల్లె వద్ద బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తాపడటంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా... కర్ణాటక రాష్ట్రం మాలూరుకు చెందిన శివ, రామప్ప, శభరీష్, హరీష్, రవిలతో పాటు మరి కొందరు మంగళవారం బోయకొండ గంగమ్మను దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి బొల్తాపడటంతో ఐదుగురు గాయపడ్డారు. మరో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి కోలార్ మెడికల్ కాలేజీకి తరలించారు.

ఫోన్‌తో ఉడాయింపు

పుంగనూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): నమ్మించి ఫోన్ తీసుకుని ఉడాయించాడో దుండగుడు. వివరాలిలా... పట్టణానికి చెందిన సునీల్ ఆర్టీసీ డిపో సమీపంలో ద్విచక్రవాహనాల మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి షాపు వద్దకు వచ్చాడు. కాల్ చేసుకుని ఇస్తానంటూ నమ్మించి ఫోన్ తీసుకుని అక్కడ నుంచి పరారయ్యాడు. సునీల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కైగల్‌కు జలకళ



బైరెడ్డిపల్లె, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కైగల్ జలపాతం తాజా కళ సంతరించుకుంది. కొంతకాలంగా చుక్కనీరులేక కళావిహీనంగా మారిన ఈ జలపాతానికి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీటిప్రవాహం చేరి కనువిందు చేస్తోంది. జలపాతం అందాలను ఆస్వాదించడానికి పర్యాటకులు వస్తున్నారు.

కొవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

సదుం, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న కోవిడ్ కేసుల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత అనుభవాల దృష్ట్యా కోవిడ్ నియంత్రణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వడివడిగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులు

● అక్టోబరు 2 కల్లా చెత్త ప్రాసెసింగ్ లక్ష్యం



కంపోస్టు యార్డులో చెత్త సేకరణ

కుప్పం, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ చెత్త సమస్య పూర్తిగా తొలగనుంది. డీకేపల్లె పరిధిలోని మోడల్ కాలనీ సమీపంలోని కంపోస్టు యార్డు వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులు కూడా త్వరలోనే తీరనున్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండుమూడు రోజుల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు ప్రారంభం కానుంది. మేజర్ పంచాయతీగా ఉన్నప్పటి నుంచీ చెత్త సమస్య ఉంది. మరో 7 పంచాయతీలు కలిసి మున్సిపాలిటీగా ఏర్పడ్డాక సమస్య మరింత ఎక్కువైంది. రోజుకు సుమారు 21 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీనిని మోడల్ కాలనీ సమీపంలోని కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. సుమారు 100 మంది పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారు. కానీ, కంపోస్టు యార్డు నుంచి మరోచోటకు తీసుకువెళ్లేందుకు వీలు లేకపోవడంతో గుట్టలుగా పోగుపడింది. దుర్గంధం భరించలేక యార్డును మరోచోటకు తరలించాలంటూ మోడల్ కాలనీ వాసులు తరచూ ఆందోళన చేస్తున్నారు. ఈ వ్యవహారం మున్సిపాలిటీకి తలనొప్పిగా తయారైంది.



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌తో చెక్

రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటుతో ముందుకొచ్చింది. అన్ని మున్సిపాలిటీలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు టెండర్లు పిలిచి, పనిలోకి దిగింది. ఈక్రమంలో ఇక్కడ కూడా వారం రోజులుగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం కంపోస్టు యార్డులో విండోస్ ప్రాసెసింగ్ జరుగుతోంది. ఈ పనిపూర్తయ్యాక, యంత్రాన్ని ఏర్పాటు చేసి చెత్తను ప్రాసెసింగ్ చేస్తారు. అంటే ప్రాజెక్టు రెండుమూడు రోజుల్లో ప్రారంభమవుతుందన్నమాట. అక్టోబరుకల్లా 20 వేల టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేయాలన్నది టెండరు నిబంధనలో ఉన్న లక్ష్యం. కంపోస్టు యార్డులో పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఏఈ ఆంజనేయులు పరిశీలించారు.

సమష్టిగా పనిచేస్తే ఆదాయబాటలోకి డిపో

ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు



ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు నుంచి ప్రశంసాపత్రాలను అందుకుంటున్న సిబ్బంది

పలమనేరు, మే27 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు డిపోలో ఉద్యోగులు సమిష్టిగా పని చేసి ఆదాయం డిపోను ఆదాయబాటలో నడపాలని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు సూచించారు. మంగళవారం ఆయన డిపోను సందర్శించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎండీ మాట్లాడుతూ ఆర్టీసీ పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధునికీకరణ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈక్రమంలోనే ఎలెక్ట్రిక్ బస్సులు, సీఎన్‌జీ బస్సులు నడుపుతున్నామన్నారు. ఇందుకోసం కొత్తగా 750 ఎలెక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయడంతో పాటు చార్జీంగ్ స్టేషన్లుకూడ సమకూర్చుతున్నామఅన్నారు. దూర ప్రాంతాలకు మాత్రమే డీజిల్ బస్సులే ఉంటాయన్నారు. తిరుపతి బస్టాండు ఆధునికీకరించనున్నామరు. ఆదాయం పెరగాలని, ఆక్యుపెన్సీ పెంచితేనే మెరుగైన సేవలను అందిచగలమన్నారు. డిపోలో ఉత్తమ సేవలందిస్తున్న సిబ్బంది డ్రయివర్ ఏవైరెడ్డి, కండక్టర్ హేమలత, గుప్తాలతో పాటు వివిధ శాఖల సిబ్బందికి ప్రశంశాపత్రాలను అందజేసి సన్మానించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలునాటి నీరు పోశారు. డిపో విస్తీర్ణాన్ని, వెలుపల ఉన్న ఖాళీస్థలం విస్తీర్ణాన్ని, బస్టాండుకు ఉన్న స్థల విస్తీర్ణాన్ని డిపో మేనేజర్ టీకేస్వామి వివరించారు. ఎండీ బస్టాండులో వసతులను పరిశీలించారు. ఆయనను యానియన్ నాయకులు సన్మానించారు.

వైభవంగా సల్లాపురెమ్మ పుష్పపల్లకి సేవ



విశేషాలంకరణలో సల్లాపురెమ్మ - ఆలయంవద్ద భక్తుల సందడి

బైరెడ్డిపల్లె, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వున్న సల్లాపురెమ్మ ఆలయ ఉత్సవాల్లో ప్రధానమైన పుష్పపల్లకి సేవ వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి పల్లకిలో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, బాణసంచాపేలుళ్ల మధ్య ఊరేగించారు. భక్తుల మంగళహారతులందుకుంటూ మంగళవారం ఉదయం ఆలయం వద్దకు ఊరేగింపు చేరుకుంది. కర్ణాటక కళాకారుడి పూలగెరిగె విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధికసంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు.

యోగాపై అవగాహన ర్యాలీ



పుంగనూరు, మే27(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చునని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. యోగా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మున్సిపల్ అధికారులు, సీఐ సుబ్బరాయుడు, మెప్మా, సచివాలయ సిబ్బందితో కలసి స్థానిక ఇందిరాసర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు అవగాహప ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మానసిక,శారీరక ఆరోగ్యం కోసం యోగా అలవర్చుకోవాలని సూచించారు.

టీడీపీ హయాంలోనే అన్ని వర్గాలకూ గుర్తింపు



గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న సుకుమార్

పుంగనూరు రూరల్, మే27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పాలనలోనే అన్ని కులాలకు గుర్తింపు వచ్చిందని టీడీపీ వాల్మీకి సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు, విశ్రాంత డీఎస్పీ సుకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక హైస్కూల్ వీధిలో టీడీపీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిగా కార్యకర్తల సంక్షేమం కోసం నిధిని ఏర్పాటు చేసిన ఘనత పార్టీ అధినేత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యకర్తలు రూ. 100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల బీమా వర్తింపజేయడం గొప్ప విషయమన్నారు. టీడీపీ నాయకులు రవికుమార్, నవీన్‌కుమార్, సులోచన, ప్రతాప్, సంతోష్, సలీం, హరినాథ్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), మే 27 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కృష్ణాజిల్లా మైలవరంకు చెందిన పెద్దినేని శ్రావణి, సుధా రూ.లక్షను మంగళవారం విరాళంగా అందించారు. దాతలను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



పుంగనూరు రూరల్, మే27(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పుంగమ్మ చెరువు మొరవ, దండుపాళ్యం మార్గంలో శనీశ్వరస్వామి శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు. అర్చనలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు ఉపవాసాలతో ఆలయాలకు చేరుకుని నూనెతో అభిషేకాలు చేశారు. మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కైగల్-రామసముద్రం రహదారిలో అవస్థలు



అధ్వానంగా తయారైన రహదారి

బైరెడ్డిపల్లె, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైగల్ నుంచి రామసముద్రం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వాన స్థితికి చేరుకుంది. ఈ రహదారిలో ఇబ్బంది పడుతున్నామని ఈ ప్రాంతప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తారు రోడ్డు వేయడానికి పనులు ప్రారంభించి అర్ధంతరంగా నిలిపివేశారు. రహదారి పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణించాలంటే సాహసమేనంటున్నారు. రాళ్లు తేలిపోయి గుంతలమయమైన రహదారిలో విద్యార్థులు, వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి రైతులు అగచాట్లు పడుతున్నారు.ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని ఈ రహదారి మెరుగుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కడప బాట పట్టిన టీడీపీ శ్రేణులు



నాయకులతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి- కడపలో మహానాడు మహా ద్వారం వద్ద మునస్వామి తదితరులు

రొంపిచెర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): మహానాడుకు మండలం నుంచి మంగళవారం నియోజకవర టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈసందర్భంగా చల్లాబాబు మాట్లాడుతూ గురువారం మహానాడు సభకు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. మహానాడుకు వెళ్లిన నాయకుల్లో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాలరమణ, నియోజకవర్గ ఐ-టీడీపీ అధ్యక్షుడు గూడురి హరిబాబు, మదనమోహన్‌రెడ్డి తదితరులున్నారు.

కల్లూరు: మండలంలోని 25 పంచాయతీల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో కడప వెళ్లారు. వీరికి ప్రాంగణం వద్ద చల్లా రామచంద్రారెడ్డి స్వాగతం పలికారు. పార్టీ నాయకులు ముల్లంగి వెంకటరమణ, సుబ్రమణ్యంనాయుడు, ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, గోపినాయుడు, గిరి, తదితరులు పాల్గొన్నారు **బైరెడ్డిపల్లె:** మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు బైరెడ్డిపల్లె నుంచి పలువురు టీడీపీనాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు పలు వాహనాల్లో వెళ్లాయి. **వి.కోట:** మండలం నుంచి మహానాడుకు అధిక సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు వెళ్ళారు. వందలాది కార్లు, ఇతర వాహనాల్లో కడప బాటపట్టారు. స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సారథ్యంలో మహానాడులో పాల్గొనడం ఆనందంగా ఉందని నాయకులు పేర్కొన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మెన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, ఈశ్వర్, ధీరజ్ తదితరులు వెళ్లారు. **రామకుప్పం:** మంత్రి నారాలోకేశ్ ప్రకటించిన ఆరు శాసనాలు, ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, పార్టీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డిలు అన్నారు. మండలం నుంచి పలువురు నేతలతో కలిసి వారు మహానాడుకు తరలివెళ్లారు. వారి వెంట మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, కృష్ణానాయక్, రామ్మూర్తి, నరసింహులు, కొళ్ళపల్లెబాబు తదితరులున్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి



కైలాసనాథుడికి మబ్బుల ఛత్రం

ఈదఫా రోహిణి కార్తె ఆరంభం ప్రశాంతంగా మొదలైంది. భానుడు నిప్పులు చెరగడం లేదు. మున్నెన్నడూ లేని విధంగా నైరుతి రుతుపవనాలు తొందరగానే పలకరించడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. వాతావరణం కూడా ఆహ్లాదంగా మారిపోయింది. ఓ మాదిరి ఎండ కాసినా కాసేపటికే మబ్బులొచ్చి ఊరటనిస్తున్నాయి. ఈక్రమంలోనే మంగళవారం చిత్తూరు కైలాసధామం వద్ద శివుడి ధ్యానముద్ర ప్రతిమ చుట్టూ మేఘాలు నాట్యమాడాయి. ఈ మనోహర దృశ్యం నగర ప్రజలను ఆకట్టుకుంది.

వైభవంగా పాలేటి గంగమ్మ జాతర



గంగమ్మ ప్రతిమ వద్ద భక్తుల సందడి

ఐరాల, మే 27 (ఆంధ్రజ్యోతి): ఐరాలలోని గార్గేయనదీ తీరాన ఉన్న పాలేటమ్మ ఆలయంలో మంగళవారం గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు అమ్మవారికి తెరను తీసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి అమ్మవారి భక్తులు పొంగళ్లు పెట్టి, అంబళ్లు పోశారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం జాతర నిర్వాహకుడు, ఆలయ ధర్మకర్త ఎంకే బాలాజి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని వందలాదిగా భక్తులు దర్శించుకున్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు రసీదు అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి

ఐరాల(కాణిపాకం), మే 27 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కృష్ణాజిల్లా మైలవరంకు చెందిన పెద్దినేని శ్రావణి, సుధా రూ.లక్షను మంగళవారం విరాళంగా అందించారు. దాతలను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అంకురార్పణ



అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్న వరసిద్ధుడి ఆలయ ఈవో తదితరులు

ఐరాల(కాణిపాకం), మే 27 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి గుడికి అనుబంధంగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మహాకుంభాభిషేకం కార్యక్రమంలో భాగంగా అంకురార్పణను మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

6న మహాప్రస్థానం ప్రారంభం



మీడియాతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

చిత్తూరు అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): కైలాసపురంలో అధునాతన సౌకర్యాలతో లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.3కోట్లతో నిర్మించిన మహాప్రస్థానాన్ని (ఎలక్ట్రిక్ బర్నర్‌ను) జూన్ ఆరో తేదీన ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు మీడియాకు వివరాలు తెలిపారు. ఈ మహాప్రస్థానాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ టీజీ వెంకటేష్, స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ద్వారా ప్రారంభించనున్నట్లు చెప్పారు.

పాడిపరిశ్రమపై అవగాహన సదస్సు

యాదమరి, మే 27 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు పాడిపరిశ్రమపై అవగాహన పెంచుకోవాలని శ్రీజ పాల సంస్థ ఏరియా మేనేజర్ మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలపరిధిలోని బీఎంసీయూలకు పాలు సరఫరా చేసే డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారికి వాటర్ బాటిల్, మినరల్ మిక్చర్, హార్లిక్స్ ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధితురాలికి చెక్ అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందిన వారి కుటుంబీకులకు ఆర్థికసాయాన్ని ఎస్పీ మణికంఠ మంగళవారం అందించారు. కార్వేటినగరంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఈ ఏడాది మార్చి 31వ తేదీన మృతి చెందిన కుబేంద్ర భార్య శివాణికి కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును అందించారు. అలాగే జిల్లా కేంద్రంలో క్లాస్-4 ఉద్యోగిగా పనిచేస్తూ అనార్యోగంతో శ్యామలాకుమారి మృతి చెందారు. ఆమె కుమారుడు ప్రశాంత్‌కు రూ.లక్ష చెక్కును అందించారు. బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.



మురుగు, గుర్రపు డెక్కతో నిండిపోయిన గిరింపేట దుర్గానగర్ కాలనీ చెరువు

దుర్గంధం భరించలేకున్నాం / గిరింపేట దుర్గానగర్ కాలనీవాసుల ఆవేదన

చిత్తూరు కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): దుర్గంధం భరించలేకున్నామని గిరింపేట దుర్గానగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ మధ్యలో ఉన్న చెరువులోకి వర్షపునీటితోపాటు మురుగు చేరుతోంది. చెరువంతా గుర్రపు డెక్కతోనూ నిండిపోయింది. దోమలూ పెరిగిపోయాయి. దీనివల్ల చెరువు చుట్టూ ఉన్నవారు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. ఇటీవల కాలనీలోని ఇద్దరికి డెంగ్యూ సోకి తీవ్ర అస్వస్థతకు గురై తిరుపతి స్విమ్స్‌లో చికిత్స కూడా తీసుకున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే మరింత మంది ఆస్పత్రి పాలయ్యే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.







చక్రస్నానంలో పాల్గొన్న అధికారులు, భక్తులు - ధ్వజావరోహణం నిర్వహిస్తున్న అర్చకులు

వేణుగోపాలుడి ఆలయంలో శాస్త్రోక్తంగా చక్రస్నానం

వెదురుకుప్పం, మే 27 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శాస్త్రోక్తంగా చక్రస్నానం జరిగింది. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. చూర్ణాభిషేకం చేశాక భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. తర్వాత స్వామి వారిని పల్లకిలో పుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. స్నపన తిరుమంజనం నిర్వహించాక, చక్రస్నానం జరిగింది. నవసంధి, మాడ వీధి ఉత్సవం, ధ్వజావరోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. యాగశాలలో పూర్ణాహుతి, కుంభం వేంచేపు, ప్రత్యేక గంట కంకణ భట్టాచార్యుల బహుమానం జరిగింది. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, కంకణ భట్టార్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణ దాసరి, గోపాలాచారి, శభరీష్, రమేష్, ధన్వంతరి, ప్రశాంత్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజావరోహణం

కార్డుదారుల నుంచి ఫిర్యాదులు రాకూడదు

● రేషన్ డీలర్లకు తహసీల్దార్ల ఆదేశం

విజయపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డుదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని రేషన్ డీలర్లను తహసీల్దార్ కిరణ్ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మార్కండేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాలసముద్రం: తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రేషన్ డీలర్లకు తహసీల్దార్ అరుణ కుమారి పలు సూచనలిచ్చారు. కార్డుదారులకు అసౌకర్యం కలగకుండా రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు. అంతకుముందు తూనికల, కొలతల యంత్రాలను తెప్పించుకుని, మరమ్మతులు చేయించి డీలర్లకు అందజేశారు.

బంగారుపాళ్యం: తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో జరిగిన సమావేశంలో తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. తూకాల్లో కచ్చితత్వం పాటించాలని చెప్పారు. తేడాలుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న రేషన్‌షాపు డీలర్లు

శ్రీరంగరాజపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ షాపు డీలర్లు మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట సీఎం చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు జయరామ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మి, జయంతి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తహసీల్దార్ లోకనాథం పిళ్లై అధ్యక్షతన జరిగిన సమావేశానికి డీలర్లు హాజరయ్యారు.

ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగాలి

● డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి



మహిళలకు సూచనలిస్తున్న శ్రీదేవి

వెదురుకుప్పం, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం కార్వేటినగరం వెలుగు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ క్రమంలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. డ్వాక్రా సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఏపీఎం కవిత ఉన్నారు.

బ్రిడ్జిపై లైట్లు వెలగడం లేదు

● పది రోజులుగా ఇబ్బంది పడుతున్న జనం



చిత్తూరు సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): దొడ్డిపల్లె రైల్వే ఓవర్ బ్రిడ్జిపై పదిరోజులుగా లైట్లు వెలగడం లేదు. దీనివల్ల ఈ మార్గంలో మురకంబట్టు, ఇందిరమ్మ కాలనీ, రైస్‌మిల్లు, కోకావాళ్లపూరు, పెనుమూరు క్రాస్, ఎస్వీ సెట్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. రాత్రయితే ఈ ప్రాంతంలో ఆకతాయిల ఆగడాలూ ఎక్కువయ్యాయి. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, వృద్ధులు ఈ మార్గంలో రావాలంటే భయపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చెట్లను నరికేస్తున్నారు!

● వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్న ఇటుక బట్టీ వ్యాపారులు



ఇటుక బట్టీ వద్ద నిల్వ ఉన్న కట్టెలు

పాలసముద్రం, మే 27 (ఆంధ్రజ్యోతి): వృక్షో రక్షతి.. రక్షితః అనే నినాదంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున చెట్లు నాటాలని ప్రోత్సహిస్తుంటే అంతకంటే వేగంగా పాలసముద్రం మండలంలో ఉన్న చెట్లను నరికి ఇటుక బట్టీలకు వినియోగిస్తున్నారు. పచ్చి ఇటుకలను కాల్చడానికి రైతులను ప్రలోభ పెట్టి తక్కువ ధరలకు చెట్లను వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఆపై వాటిని నరికేసి.. ఇటుక బట్టీలలో ఉపయోగిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే కొందరు అక్రమార్కులు అడవుల్లోని చెట్లను సైతం నరికి ఇటుక బట్టీల్లో వాడుతున్నారు. మరోవైపు వాల్టా చట్టానికి తూట్లు పడుతున్నా.. పరిరక్షించాల్సిన రెవెన్యూ, అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి, తగిన తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

యోగాతో మానసికోల్లాసం

విజయపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసికోల్లాసం కలుగుతుందని యోగా శిక్షకుడు, రిటైర్డు ఎంఈవో కైలాసం తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో యోగాపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, పలువురు శిక్షకులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర

పాలసముద్రం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆముదాలలో గంగ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ విగ్రహాన్ని ఊరేగించారు. సాయంత్రం ఆలయంలో మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులను తీర్చుకున్నారు. సామూహిక సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.

హైరోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన మేయర్



ఏసీపీ నాగేంద్రతో కలిసి పనులను పరిశీలిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర పరిధిలోని హైరోడ్డు విస్తరణ పనులు మంగళవారం జరిగాయి. ఇదివరకు కట్టమంచి నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న ప్రభుత్వ భవనాలు, స్థలాలను పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా ప్రైవేటు భవనాల యజమానులతో విడతలవారీగా చర్చించారు. ఈ క్రమంలో మంగళవారం తిరుపతి రోడ్డులోని కట్టమంచి వద్ద ఉన్న ప్రైవేటు బిల్డింగ్ యజమానులతో చర్చించి విస్తరణ పనులు చేపట్టారు. ఈ పనులను ఏసీపీ నాగేంద్రతో కలిసి మేయర్ అముద పరిశీలించారు.

ముగిసిన యోగా మాస్టర్ ట్రైనర్ల శిక్షణ



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటరమణ

చిత్తూరు క్రీడలు, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా మండల, గ్రామ స్థాయిలో మాస్టర్ ట్రైనర్ల (పీడీలు, పీఈటీల)కు మూడ్రోజులుగా ఇస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. స్థానిక పీవీకేఎన్ వాకర్స్ అసోసియేషన్ యోగా కేంద్రంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ ముగింపు సమావేశానికి డీఈవో వరలక్ష్మి, ఎస్ఎస్ఏపీసీ వెంకటరమణ విచ్చేశారు. పీడీ, పీఈటీలకు సూచనలు చేశారు.

ధ్వంసమైన వాటర్ ట్యాంకు మెట్లు



గుడిపాల, మే 27 (ఆంధ్రజ్యోతి): వెంగంపల్లె ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంకు మెట్లు ధ్వంసమయ్యాయి. వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

చిత్తూరు సిటీ, మే27 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు కార్యక్రమానికి జిల్లా నుంచి ఆ పార్టీ శ్రేణులు మంగళవారం తరలివెళ్లాయి. ఉదయం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద నుంచి చిత్తూరు నగరం, రూరల్, గుడిపాల మండల నేతలు, నగరంలోని డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు బయల్దేరి వెళ్లారు.

పెనుమూరు: మండలం నుంచి టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు, తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, నాయకులు తలారిరెడ్డెప్ప, భాస్కర్, కృష్ణమూర్తినాయుడు, శ్రీనివాసచౌదరి, యోగమనాయుడు, దిష్ శివ, ప్రసాద్, రాజగోపాల్‌నాయుడు, గంగాధరం, గుర్రప్పనాయుడు, నాగరాజు, సురేష్‌చౌదరి, చక్రపాణి, రమేష్‌నాయుడు తదితరులున్నారు.

నగరి: మండలం నుంచి టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజి, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, నగరి మున్సిపాలిటీ టీడీపీ కార్యదర్శి శ్రీనివాసన్ తదితరులున్నారు.

నిండ్ర: మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు విజయ్‌కుమార్, దశరథవాసు, రవినాయుడు, వెంకటేశులురెడ్డి, బాబు యాదవ్, గాలి రమేష్ నాయుడు, ఏజే రవికుమార్, తేజేష్, ఓంప్రకాష్, జగన్, రఘురాం, ఎబీరాజ్, మనోహర్‌నాయుడు, గజేంద్రనాయుడు, మనోజ్, కాటయ్య, నంద, రఘు, ఆనందరాజు, చిట్టిబాబు నాయుడు, రమేష్ ప్రకాష్, మురళీనాయుడు తదితరులున్నారు.

విజయపురం: మండలం నుంచి చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగుమహిళ అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు గజేంద్రనాయుడు, దశరథరాజు, గుణశేఖర్‌రెడ్డి, బాలాజీనాయుడు, అశోక్, నారాయణరాజు, రవిరాజు, మురళీనాయుడు, పురుషోత్తం, శివలింగం, మురళి, సుధాకర్‌నాయుడు తదితరులున్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల నుంచి తెలుగు తమ్ముళ్ల ప్రభుత్వ విప్ థామస్ నేతృత్వంలో తరలివెళ్లారు.







టీడీపీ శ్రేణులతో కలిసి చిత్తూరు నుంచి బయల్దేరిన ఎమ్మెల్యే జగన్మోహన్ - విజయపురం నుంచి బయల్దేరిన టీడీపీ నేతలు - కడపలో పెనుమూరు టీడీపీ నేతలు